సాక్షి
పల్నాడు
బుధవారం : 20 : ఆగస్టు : 2025



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నాదెండ్ల: నేర ప్రవృత్తిని విడనాడాలని నాదెండ్ల ఎస్‌ఐ పుల్లారావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.



పసుపు కొమ్ములతో మహాభిషేకం

నాగాయలంక: శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలోని శివలింగానికి మంగళవారం 108 కిలోల పసుపు కొమ్ములతో మహాభిషేకం జరిపారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: భవానీనగర్‌లో వేంచేసియున్న శ్రీ కనక దుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

న్యూస్‌రీల్

మంగళగిరిలో ఇన్నోవేషన్ హబ్

నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



మంగళగిరి టౌన్: యువతలోని వినూత్న ఆలోచనలను మెరుగుపట్టి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి నగర పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న మయూరి టెక్ పార్క్‌లో ఈ హబ్ ఏర్పాటైంది. దీనిని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. యువతకు ఇక్కడ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను సీఎం పరిశీలిస్తారని ఇన్నోవేషన్ సొసైటీ సీఈఓ సూర్యతేజ తెలిపారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



తాడికొండ: అమరావతి రాజధానిలోని వేంకటపాలెంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం యాగశాలలో పంచగవ్యారాధన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేష అభిషేకం నిర్వహించారు. సాయంత్రం యాగశాల వైదిక కార్యక్రమాలు, పవిత్ర ప్రతిష్ఠ, అధివాసం, సర్వదైవత్య హోమం చేపట్టారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, సందీప్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు పూర్తి చేయాలి



నరసరావుపేట రూరల్: జిల్లాకు లక్ష్యంగా విధించిన భూసార పరీక్ష నమూనాలను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. నరసరావుపట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని మట్టి నమూనా కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. మట్టి నమూనాల పరీక్షల తీరును అడిగి తెలుసుకున్నారు. మట్టి నమూనా కేంద్రంలో భూసార పరీక్షల నమూనాలకు సంబంధించి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని తెలిపారు. ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ఏఓలు ఐ.శాంతి, శివలలిత, భూసార పరిశోధన కేంద్రం అధికారి పి.యాకోబు, వ్యవసాయ విస్తరణ అధికారి కె.నాగేశ్వరరావు, పి.విజయదుర్గ, బ్రహ్మయ్యలు పాల్గొన్నారు.

'ఉత్తమ ఉపాధ్యాయ' దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపిక ప్రారంభించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం తెలిపారు. జిల్లా పరిధిలో అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 25వ తేదీ లోపు తమ దరఖాస్తులను జిల్లా ఉప విద్యాశాఖాధికారికి అందజేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేయనున్న నేపథ్యంలో జిల్లాస్థాయిలో ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు వివరించారు. జిల్లాస్థాయిలో ఎంపికను పూర్తి చేసేందుకు కమిటీ ఏర్పాటవుతుందని, సదరు కమిటీ ఎంపిక చేసిన వారి పేర్లు, దరఖాస్తుల హార్డు కాపీలను ఈనెల 27వ తేదీన రాష్ట్ర కార్యాలయానికి పంపుతారని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు పెంచేందుకు చేసిన ప్రత్యేక కృషి, విద్యా వినూత్న రచనలు, అభ్యాస పదార్థాల రూపకల్పనను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు 10 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసి, ఎటువంటి నేర చరిత్ర లేని వారై ఉండాలని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వారిని సైతం ప్రభుత్వం సత్కరిస్తుందని తెలిపారు.

ఉచితం సరే.. బస్సులు పెంచరే!

'తాంబూలాలు ఇచ్చాం.. తన్నుకు చావండి' అన్నట్లుంది కూటమి ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం తీరు. మహిళలకు ఉచిత బస్సు అంటూ ఆర్భాటంగా ప్రారంభించి, ఆనక చేతులు దులుపుకొన్నారు. బస్సులు లేక.. కేటాయించిన అరకొర బస్సుల్లో సీట్లు లేక.. కష్టపడి ఎక్కితే నిలబడేందుకు సైతం తావు లేక.. మహిళలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండుల వద్ద ఉచిత బస్సు ఎక్కాలంటే యుద్ధ వాతావరణమే కనిపిస్తోంది. జిల్లాలోని 195 గ్రామాలకు అసలు బస్సు సౌకర్యమే లేకపోవడంతో వేలమంది మహిళలు పథకానికి దూరమై.. ప్రమాదకర స్థితిలో ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఉచితం సరే.. బస్సులు పెంచరే.. అని మహిళలు పెదవి విరుస్తున్నారు.

- ఆర్భాటంగా స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన ప్రభుత్వం
- లక్షల మంది మహిళలకు స్వల్ప సంఖ్యలోనే బస్సులు
- బస్సుల సంఖ్య పెంచి అన్నిరకాల సర్వీసుల్లో ఉచితం అమలు చేస్తేనే ఉపయోగం
- ఉచిత బస్సుల కోసం బస్టాండుల వద్ద మహిళల పడిగాపులు
- జిల్లాలో బస్సు ముఖం చూడని 195 గ్రామాలు
- తమ గ్రామానికి బస్సు లేనప్పుడు ఉచితమైనా ఉపయోగమేమిటంటున్న మహిళలు



సాక్షి, నరసరావుపేట: స్త్రీ శక్తి పేరుతో కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించి చేతులు దులుపుకొంది. అన్ని రకాల బస్సుల్లో ఉచిత సౌకర్యం కల్పించకపోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంతో పాటు గుంటూరుకు ఎక్కువగా సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. వీటిలో మహిళలకు ఉచిత సౌకర్యం లేదు. అలాగే నరసరావుపేట - గుంటూరు నగరాల మధ్య సుమారు 17 నాన్‌స్టాప్ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో మహిళలు నగదు చెల్లించి టికెట్ తీసుకోవాల్సిందే. పోనీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అయినా ప్రయాణిద్దామంటే ఆ బస్సుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. కొత్తవి కొనుగోలు చేసి బస్సుల సంఖ్య పెంచుతామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలేవి తీసుకోలేదు.

బస్సు ముఖం చూడని గ్రామాలు

గ్రామీణ జనాభా అధికంగా ఉన్న పల్నాడు జిల్లాలో ఆర్టీసీ సేవలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. డిపోలలో బస్సుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న వాటిలో చాలా వరకు కండీషన్‌లో లేవు. ఇటీవల కాలంలో వినుకొండ, మాచర్ల బస్సుల్లో స్టీరింగ్ రాడ్ విరిగిపోయి ప్రమాదం నుంచి తప్పించుకున్న ఘటనలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 195 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ముఖ్యంగా మాచర్ల, వినుకొండ డిపోల పరిధిలోని గ్రామాలలో ఈ సమస్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకొన్నా ఉపయోగం లేదని మహిళలు పెదవి విరుస్తున్నారు. తమ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకుండా ఉచితమంటే ఉపయోగమేంటని ప్రశ్నిస్తున్నారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తేనే ఉచిత బస్సు ప్రయోజనాలను మహిళలు పొందగలుగుతారు. లేకుంటే కూటమి ప్రభుత్వ ప్రచారానికి మాత్రమే ఈ పథకం పరిమితం కానుంది.

అరకొర బస్సులతో మహిళల కష్టాలు



నరసరావుపేట బస్టాండ్‌లో పల్లె వెలుగు బస్సు ఎక్కేందుకు పాట్లు

ఉచితం 364 బస్సులలోనే...

పల్నాడు జిల్లావ్యాప్తంగా ఆరు ఆర్టీసీ బస్సు డిపోల పరిధిలో మొత్తం 439 బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తుంటాయి. ఇందులో ఉచిత బస్సు పథకం కింద 364 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళలకు ఉపయోగపడుతున్నాయి. ఇవే పల్నాడు జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. సుమారు 14 లక్షల మహిళలున్న జిల్లాలో కేవలం 364 బస్సులకు మాత్రమే ఉచిత సదుపాయం ఇవ్వడమేంటని మహిళామణులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఉచిత బస్సు పథకం అమలు చేయకముందు సగటున రోజు రూ.12 నుంచి 13 లక్షల ఆదాయం లభించేదని, ప్రస్తుతం ఆదాయం రూ.18 లక్షలకు పైగా ఉంటోందని అధికారులు చెబుతున్నారు. అంటే దాదాపు 30 నుంచి 50 శాతం దాకా ఆక్యుపెన్సీ పెరిగింది. గతంలోనే జిల్లాలో తీవ్ర బస్సుల కొరత ఉంది. అలాంటి సమయంలో ఆక్యుపెన్సీ పెరిగిన నేపథ్యంలో కొత్త సర్వీసులు పెంచాలి. ఇదే విషయాన్ని ఆర్టీసీ అధికారులు సైతం ప్రభుత్వానికి నివేదించారు. అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



నరసరావుపేట బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న మహిళలు

మా గ్రామానికి బస్సు లేదు



మా పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. అలాంటప్పుడు ప్రభుత్వం ఉచిత బస్సు పథకం అమలు చేసినా మాకు పెద్దగా ఉపయోగం లేదు. దీంతో ఆటోలలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా మా గ్రామ విద్యార్థులు కాలినడక, ఆటోలలో బడులకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే మా గ్రామానికి ఆర్టీసీ బస్సులను తిప్పాలి. అప్పుడే మేం పూర్తిగా ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకోగలం.

– బుదాటి మరియమ్మ, నందిరాజుపాలెం, బొల్లాపల్లి మండలం

నిలబడేందుకు కూడా ఇబ్బందే..



బస్సుల సంఖ్య పెంచకపోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అన్ని బస్సులకు ఉచితం అమలు చేయకపోవడంతో వచ్చే ఒకటీ, రెండు బస్సుల కోసం తీవ్రంగా ఎదురుచూడాల్సి వస్తోంది. సీట్లు దొరక్కపోగా నిలబడేందుకు కూడా చోటు లేకుండా మారింది.

– వేముల గురవమ్మ, పిడుగురాళ్ల

ఆటోలలో వెళుతున్నాం..



అన్ని గ్రామాలకు బస్సులను నడపకపోతే ఉపయోగం లేదు. మా గ్రామానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఆటోలలో ప్రయాణించాల్సి వస్తోంది. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తేనే పథకాన్ని పూర్తిగా ఉపయోగించుకోగలం.

– తిరువీధి శివకుమారి, పిచ్చుకలపాలెం, శావల్యాపురం మండలం

వరద ఉధృతం.. భయం భయం



రామాపురం మత్స్యకారుల కాలనీని ఆనుకుని ప్రవహిస్తున్న కృష్ణానది

- దాచేపల్లి మండలం రామాపురం మత్స్యకారుల కాలనీకి చేరువలోకి కృష్ణా నది వరద నీరు
- భయం గుప్పిట్లో గ్రామస్తులు

దాచేపల్లి: కృష్ణా నదిలో వరద నీటి ఉధృతితో స్థానిక మత్స్యకారుల కాలనీ ముంపు ముంగిట్లో ఉంది. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలోని మత్స్యకారుల కాలనీని ఆనుకొని కృష్ణానది మంగళవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. కాలనీలోని నివాస గృహాలకు కూతవేటు దూరంలో వరద నీరు ప్రవహిస్తుండంతో మత్స్యకారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. కాలనీలో 50కి పైగా మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి వరద నీరు దిగువకు విడుదల చేయడం వలన నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నీటి విడుదల పెరిగితే కాలనీలోకి వరద నీరు చేరే అవకాశం ఉంది. నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగితే మత్స్యకారులను అక్కడి నుంచి ఖాళీ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

'ప్రత్యేక' శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ సెల్వరాజ్

సత్తెనపల్లి: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఉచిత వైద్య నిర్ధారణ శిబిరాలను వినియోగించుకోవాలని సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ సెల్వరాజ్ అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం విద్యాశాఖ, సమగ్ర శిక్ష పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో అలింకో వారిచే మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య నిర్ధారణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెల్వరాజ్ మాట్లాడుతూ జిల్లాలోని 28 భవిత సెంటర్లలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు 540 మంది ఉన్నారన్నారు. వీరు కాక ప్రతి మండలంలో సుమారు 100 నుంచి 150 మంది చిన్నారులు ఉన్నారన్నారు. వీరి అవసరాల నిమిత్తం నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ నిర్ధారణ వైద్య శిబిరాలకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన ఈ శిబిరాలు 25 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 25న జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో శిబిరం జరుగుతుందన్నారు. బెంగళూరు వైద్యులు అవసరమైన ఉపకరణాలను నిర్ధారించడం జరుగుతుందన్నారు. ఉపకరణాలను త్వరలోనే ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.



సుగాలీకాలని జెడ్పీ పాఠశాలలో చిన్నారికి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యుడు

- భవిత కేంద్రాల్లో స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్ అందించడం జరుగుతుందని అంతేకాకుండా భవితా కేంద్రానికి హాజరయ్యే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అలవెన్స్ ఇస్తామన్నారు. ఈ సందర్భంగా యూనిక్ డిజేబులిటీ ఐడెంటిటీ కార్డులను ఆన్‌లైన్ చేశారు. ముందుగా ప్రత్యేక అవసరాల చిన్నారులను వైద్యులు పరీక్షించి ఉపకరణాల కోసం నిర్ధారించారు. మొత్తం 120 మంది ప్రత్యేక అవసరాల చిన్నారులు హాజరయ్యారు. ఏఎంఓ ఎస్.పూర్ణచంద్రరావు, సత్తెనపల్లి ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావు, భవిత కేంద్రం ఐఈఆర్పీలు ఏవీ శ్రీనివాస్, కె.విజయ్ కుమారి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కోడలిని చంపిన మామకు జీవిత ఖైదు

నరసరావుపేట టౌన్: కోడల్ని గొడ్డలితో నరికి హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి చెందిన దారా యాకోబుకు జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్.సత్య శ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి... మృతురాలు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గ్రంథసిరి గ్రామానికి చెందిన చిలుక సుందరరావు కుమార్తె దారా కోటేశ్వరమ్మతో నిందితుడు యాకోబు కుమారుడు శ్యాం బాబుకు ఘటనకు 12 సంవత్సరాల ముందు వివాహమైంది. వేమవరం గ్రామంలో నివసిస్తున్న కోటేశ్వరమ్మ బంధువులతో యాకోబుకు వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోటేశ్వరమ్మను ఆమె బంధువులతో మాట్లాడొద్దని యాకోబు చెప్పాడు. అయినప్పటికీ కోటేశ్వరమ్మ వాళ్లతో మాట్లాడుతుంది. దీనిని మనసులో పెట్టుకుని నిందితుడు యాకోబు 2019, నవంబర్ 11వ తేదీన కోటేశ్వరమ్మను గొడ్డలితో నరికి హతమార్చాడు. ఈ మేరకు బంధువుల ద్వారా సమాచారం అందుకున్న మృతురాలి తండ్రి చిలక సుందరరావు ఫిరంగిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో పై విధంగా తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ గుండాల సురేష్ బాబు నిర్వహించారు.

వాన మోత.. రోడ్డు కోత!



బుచ్చియ్యపాలెం మూలమలుపు వద్ద రోడ్డు కోతకు గురైన దృశ్యం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అన్నదాతల గుండెలే కాదు.. రోడ్లు కూడా కోతకు గురయ్యాయి. పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు మండలంలో పలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు వర్షాల దెబ్బకు కోతకు గురై కొట్టుకుపోయాయి.

– పెదకూరపాడు



జలాల్‌పురం వద్ద కోతకు గురైన రోడ్డు



పాటిబండ్ల డంపింగ్ యార్డు వద్ద వరద ఉధృతికి తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డు



నూతనంగా నిర్మించిన జలాల్‌పురం- కంభంపాడు రోడ్డు కొట్టుకుపోయిన దృశ్యం

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 3,600 గరిష్ఠం : రూ. 4,800

మోడల్ ధర రూ. 4,200

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	54,935
అమ్మకాలు	53,278
నిల్వ	8,716

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,300
341	10,000-14,700

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,400
నంబరు-5	10,000-13,500
341	11,000-14,800
4884	10,000-12,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,500
బాడిగ-355	10,000 - 13,200
దేవనూరు డీలక్స్	10,000 - 13,300
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	6,000 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,200
బాడిగ - 355	10,000-13,000
దేవనూరు డీలక్స్	10,500-13,500
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

వినుకొండలో మెగా కిసాన్ మేళా



వినుకొండ: వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా కిసాన్ మేళా సభలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన ప్రారంభించి, పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు.
కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, అరవిందబాబు, కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులపై కేసులు...

ఎమ్మెల్యే ధూళిపాళ్లకు సూట్ కేసులు

పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపణ



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): రైతుల పక్షాన పోరాడే వారిపై పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కేసులు పెడుతున్నారని, ఆయనకు మాత్రం సూట్‌కేసులు వెళ్తున్నాయని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. కూటమి ఏడాదిన్నర కాలం పాలనలో రైతుల సమస్యలను నరేంద్ర పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. గుంటూరులోని తన కార్యాలయంలో అంబటి మురళీకృష్ణ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంటూరు చానల్‌కు గండ్లు పడ్డాయన్నారు. ఫలితంగా పెదకాకానిలో 11 వేల ఎకరాలు, చేబ్రోలులో 5 వేల ఎకరాలు, పొన్నూరు రూరల్‌లో 15 వేల ఎకరాలు నీట మునిగాయని పేర్కొన్నారు. కొండవీటి వాగు ప్రవాహం గుంటూరు చానల్ లోకి చేరడంతో పొలాలన్నీ దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఇంతటి భారీ నష్టం సంభవిస్తే గుంటూరు చానల్ లాకులు మూసినట్టు ప్రభుత్వం చెప్పడం అబద్ధమేనన్నారు. అయితే ఆ నీరంతా ఆకాశం నుంచి వచ్చిందా, భూమి లోపలి నుంచి పైకి వచ్చిందా అనేది కూడా ప్రభుత్వమే చెప్పాలన్నారు. రైతులు మాత్రం కొండవీటి వాగు నుంచే భారీగా నీరు వచ్చి నష్టం చేసిందని చెప్పడాన్ని ఇక్కడ గమనించాలన్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి

గత ఏడాది పంటలు మునిగిపోయిన నేపథ్యంలో రూ.16 కోట్లు నష్టపరిహారంగా ఇచ్చామని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చెబుతున్నారని, అయితే ఈ ఏడాది నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వనవసరం లేదా అన్ని అంబటి మురళీకృష్ణ ప్రశ్నించారు. అంతేగాక గతంలోనే నష్టపరిహారం చెల్లించామని, కాల్వలు కూడా బాగు చేయించామని ఎమ్మెల్యే నరేంద్ర చెప్పిన మాటల్లో వాస్తవం లేదన్నారు. అదే నిజమైతే ఈ వర్షాలకు గండ్లు ఎలా పడ్డాయో చెప్పాలన్నారు. ఈ ఏడాది సార్వా సాగుకు రైతులు ఇప్పటికే ఎకరాకు రెండుసార్లు రూ. 20 వేలు ఖర్చు చేశారన్నారు. మూడోసారి నారుమడి వేసే పరిస్థితి కూడా లేదన్నారు. తక్షణమే ఎకరాకు తాత్కాలిక పరిహారంగా రూ.10 వేల నగదు, ఉచితంగా ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలన్నారు. ఇక అన్నదాతలు ఇంతటి దయనీయ స్థితిలో ఉంటే రెండు నెలలుగా ఎమ్మెల్యే నరేంద్ర నియోజకవర్గంలోనే కనిపించకపోవడం సిగ్గుచేటన్నారు. పంటల నష్టపోయినట్టు రైతులు ఎమ్మెల్యేకు ఫోన్ చేసి చెబితే... పంటలు పోతే పోయాయని, రియల్ ఎస్టేట్‌కు ఇవ్వాలని చెప్పడం ఆయన దుర్బుద్ధిని తెలియజేస్తోందన్నారు. రైతుల పక్షాన పోరాడుతుంటే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చేబ్రోలు, కొమ్మమూరు బ్రిడ్జికి సంబంధించి గుంతలు తీసి వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద నీరు భారీగా వచ్చి నడిరోడ్డుపై గుండాలు ఏర్పడ్డాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని అంబటి మురళీకృష్ణ సూటిగా ప్రశ్నించారు.

బాలుడి మృతిపై అనుమానాలు

తల్లి ఫిర్యాదు మేరకు మరణించిన రెండు మాసాల తర్వాత పోస్టుమార్టం

క్రోసూరు: మండలంలోని విప్పర్ల గ్రామంలోని ఎస్సీకాలనీ (గోవిందపురం)కు చెందిన బాలుడు రెండు మాసాల క్రితం మృతి చెందగా, బాలుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి తల్లి పోలీసుస్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన జరిగింది. ఎస్ఐ రవిబాబు తెలిపిన వివరాల మేరకు.. జూన్ నెల రెండవ తేదీన విప్పర్ల గ్రామానికి చెందిన ఎర్రగుండ్ల జోష్ణప్రకాశ్ (8) బావిలో పడి మృతి చెందాడు. అప్పుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడనుకుని ఖననం చేశారు. పది రోజుల క్రితం మృతుడి తల్లి శ్రావణి తన కుమారుడిని చంపి బావిలో వేసారన్న అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని క్రోసూరు సీఐ రమేష్, ట్రైనీ ఎస్ఐ గోపిల పర్యవేక్షణలో గుంటూరు నుంచి వచ్చిన ఇద్దరు ఫోరెన్సిక్ వైద్యులు, తహసీల్దార్ వి.వి.నాగరాజు, వీఆర్వోల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు.



పోస్టుమార్టం ప్రక్రియను పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

వైఎస్సార్ సీపీ నేతలపై విమర్శలు తగవు

- టీడీపీ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
- 'రాజధాని ముంపు'పై వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: కొండవీడు వాగు వరద మళ్లింపుతో పాటు కృష్ణా నది నుంచి నీరు వెనక్కి తన్నడం వలనే మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని తదితర మండలాలు మునిగాయని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మండలంలోని నీరుకొండ, కురగల్లుల మధ్య వాగు ముంపు ప్రాంతాలను పరిశీలించిన వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ తమ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి వాగు వరద మళ్లింపు, ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా 70 వేల ఎకరాలు పంటలు మునిగాయని చెప్పారన్నారు. రైతులను ఆదుకోవాలని కోరారన్నారు. టీడీపీ నాయకులు దీనికి సమాధానం చెప్పకుండా అడ్డగోలుగా విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. వర్షం తగ్గినా మంగళవారం వరకు ఇక్కడ కనుచూపు మేర నీరు నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగాల నాగిరెడ్డి, మల్లవరపు సుధారాణి, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, ఆర్ధల చిన్నారి, కట్టిపోగు భూషణం, షేక్ గౌస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంప్రదాయబద్ధంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ

జిల్లా గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: సనాతన హిందూ ధర్మం ప్రకారం సంప్రదాయబద్ధంగా, పర్యావరణ హితంగా మండపాలతో గణేష్ మహోత్సవాలను శోభాయమానంగా నిర్వహించాలని గుంటూరు జిల్లా గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రరాజు అన్నారు. మంగళవారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రామచంద్రరాజు మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మిక భావన వెల్లువిరిసి మన సంస్కృతీసంప్రదాయాల ప్రకారం గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసం సమితి పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ అనుమతితో ఎవరికీ ఇబ్బంది లేని విధంగా మండపాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి లక్ష్మీపతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు, అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయదలచిన భక్తులు సమితి ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వరరావును సంప్రదించి దరఖాస్తు అందిస్తే ప్రభుత్వం నుంచి అనుమతులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు. వివరాలకు 81064 33594 ఫోను నంబర్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మదన్ పురోహిత్, ఉపాధ్యక్షుడు హరిహరరాయలు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సభ్యులు కంచర్ల ఆంజనేయులు, రవి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉత్సవాల ప్రతులను ఆవిష్కరిస్తున్న పి.రామచంద్ర రాజు, లక్ష్మీపతి, మదన్ పురోహిత్, నాగేశ్వరరావు

తుళ్లూరులో 16.6 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్ళూరు మండలంలో 16.6 మిల్లీ మీటర్లు వర్షపాతం పడింది. అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.2 మి.మీ. కురిసింది. సగటు 4 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు... పెదకాకాని మండలంలో 12.4 మి.మీ., తాడేపల్లి 11.2, పెదనందిపాడు 6.2, మంగళగిరి 5.6, దుగ్గిరాల 3.8, కొల్లిపర 3.6, కాకుమాను 3, తాడికొండ 2.6, పొన్నూరు 2.2, గుంటూరు పశ్చిమ 2, మేడికొండూరు 1.6, ఫిరంగిపురం మండలంలో 1.4 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది.

కుమార్తెపై లైంగికదాడి యత్నం.. వ్యక్తిపై పోక్సో కేసు

తాడికొండ: కుమార్తెపైనే లైంగికదాడియత్నానికి ఒడిగట్టిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన తాడికొండ మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సదరు గ్రామానికి చెందిన వ్యక్తికి ఓ మహిళతో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మొదటి నుంచి ఆమెను హింసించేవాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆ మత్తులో పెద్ద కుమార్తె (16)తో అసభ్యంగా ప్రవరిస్తున్నాడు. దీంతో కుటుంబసభ్యుల సహకారంతో ఆమెతోపాటు మరో ఇద్దరు కుమార్తెలను కూడా తల్లి హాస్టల్‌లో చేర్పించింది. జూలై 27వ తేదీన హాస్టల్ నుంచి పెద్ద కుమార్తెను బలవంతంగా ఇంటికి తీసుకొచ్చిన అతడు 30వ తేదీన రాత్రి సమయంలో ఆమెపై అఘాయిత్యానికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి కాపాడారు. ఈ నెల 11న మరదలి వద్ద ఉంటున్న కుమార్తెను నిందితుడితోపాటు అతని సోదరుడు బలవంతంగా తీసుకెళ్లేందుకు యత్నించాడు. ఇంతలో స్థానికులు రావడంతో వారు పారిపోయారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు తండ్రితోపాటు కుటుంబ సభ్యులపై ఎస్ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

త్వరలో అనుబంధ విభాగాల నియామకాలు

నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా, నియోజకవర్గ, డివిజన్ అనుబంధ విభాగాల నియామకాలను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు, తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్‌లు తెలిపారు. గుంటూరు నగరంలోని అంబటి రాంబాబును, తెనాలిలో అన్నాబత్తుని శివకుమార్‌ను వారి కార్యాలయాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు, పల్నాడు జిల్లాల అనుబంధ విభాగాల ఇన్‌చార్జి షేక్ మస్తాన్‌వలి మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు జిల్లాతోపాటు, గుంటూరు పశ్చిమ, తెనాలి నియోజకవర్గాల అనుబంధ విభాగాల కమిటీల గురించి ప్రస్తావించారు. త్వరితగతిన కమిటీలు పూర్తి చేసేలా దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం కల్పించేలా పదవులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటుతో పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు.



అంబటి రాంబాబుతో మస్తాన్ వలి

లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు న్యాయ సహాయం అవసరమైతే ఈ క్లినిక్‌ను సందర్శించాలని తెలిపారు. దీనికి ప్యానెల్ అడ్వకేట్‌గా పి.రాజేష్ లింగం, పారా లీగల్ వలంటీర్‌గా పి.శిరీషను నియమించారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల, మాజీ సైనిక ఉద్యోగులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం వేలాకణికి ప్రత్యేక రైలును చర్లపల్లి-తిరువూరు-చర్లపల్లి మీదుగా నడపనున్నారు. ఈ మేరకు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. నంబర్ 07091 చర్లపల్లి - తిరువూరు రైలు ఈ నెల 27న, సెప్టెంబర్ 8వ తేదీన చర్లపల్లి నుంచి ఉదయం 8.10 గంటలకు బయలుదేరనుందని పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు తిరువూరు చేరుకుంటుందని చెప్పారు. నంబర్ 07902 తిరువూరు - చర్లపల్లి రైలు ఈ నెల 28న, సెప్టెంబర్ 9న తిరువూరులో రాత్రి 10.35 గంటలకు బయలుదేరనుందని వివరించారు. మరుసటి రోజు అర్ధరాత్రి చర్లపల్లికి 01.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

లక్ష్మీపురం: ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. గుంటూరు హిందూ కళాశాల సెంటర్‌లో మంగళవారం ఫెడరేషన్ తరఫున ఆటో కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలన్నారు. వాహన మిత్ర కింద రూ.25 వేల సాయం అందివ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు, తక్కువ వడ్డీకి రుణాలు అందించే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలని కోరారు. లేకుంటే ఈ నెల 24వ తేదీన ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలో చర్చించి ఆందోళన చేపడతామన్నారు. గుంటూరు జిల్లా ఆటోడ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు బి. లక్ష్మణరావు, గుంటూరు నగర ఆటోడ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి జి.శంకర్ రావు, కె.కోటేశ్వరరావు, షేక్ ఖాసిం, అశోక్, షేక్ జానీ, వెంకటయ్య, సాంబయ్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, ఆటో డ్రైవర్లు



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 224

కొమ్ములు : 150 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,811	10,500	10,300

కాయలు : 74 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,811	10,400	10,200

మొత్తం అమ్మకాలు : 168.00 క్వింటాళ్లు

-దుగ్గిరాల

24 నుంచి టీటీసీ థియరీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సు లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి గుంటూరులోని సెయింట్ జోసఫ్ బాలికల పాఠశాలలో జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.
టీటీసీ రెగ్యులర్, ఒకసారి తప్పిన అభ్యర్థులకు ఉదయం 11 - సాయంత్రం 4.30 గంటల వరకు జరగనున్న పరీక్షలు ఉంటాయన్నారు. హాల్ టిక్కెట్లను బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా ఒక ఫొటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు.

కేంద్ర మాజీ మంత్రి సతీమణి కన్నుమూత

దుగ్గిరాల: రాజ్యసభ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన దివంగత వెనిగళ్ల సత్యనారాయణ సతీమణి నాగేశ్వరమ్మ(94) సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆమె భౌతికకాయాన్ని మంగళవారం ప్రజల సందర్శనార్థం దుగ్గిరాలలోని స్వగృహంలో ఉంచారు. ఆమెకు కుమారుడు, అరుగురు కుమార్తెలు. నాగేశ్వరమ్మ అంత్యక్రియలు మంగళవారం దుగ్గిరాల హిందూ శ్మశాన వాటికలో ముగిశాయి. మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి, పలువురు నాయకులు, మండల అధికారులు, సర్పంచ్‌లు ఆమెకు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



నాగేశ్వరమ్మ (ఫైల్)

బైకును ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

మేదరమెట్ల: వెనుక నుంచి వచ్చిన లారీ బైకును ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల ఫైలాన్ సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు జే.పంగులూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన గోలమూడి కుమార్ (37) భార్య వెన్నెలతో కలసి ఒంగోలులో ఉంటున్న కుమారుని కలసి మోటారు బైకుపై తిరిగి స్వగ్రామం వస్తున్నారు. బైకు ఫైలాన్ సమీపానికి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ మోటారు బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో కుమార్‌ను లారీ కొద్ది దూరం లాక్కొనిపోయింది. దీంతో కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్ భార్య వెన్నెల రోడ్డు పక్కన పడిపోయింది. ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదు. తన కళ్ల ముందే భర్త విగతజీవిగా మారడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



మృతి చెందిన కుమార్

పోలీసుల అదుపులో గేదెల దొంగ

యద్దనపూడి: గేదెలను అపహరిస్తున్న ఓ వ్యక్తిని అనంతవరం గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంవత్సర కాలంగా మండలంలో గేదెల దొంగతనాలు ఎక్కువయ్యాయి. రాత్రి సమయాల్లో ఇళ్ల ముందు కట్టేసిన గేదెలను, పగలు పొలాలకు వెళ్లిన గేదెలను కొంత మంది దొంగిలించి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా యద్దనపూడి, పూనూరు, సూరవరపుపల్లి, చిమటవారిపాలెం, పోలూరు, జాగర్లమూడి గ్రామాల్లో సూమారు 30 గేదెల వరకు మాయమయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి అనంతవరం మీదుగా సూరవరపుపల్లి వైపు పశువులను తోలుకువెళుతుండటంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు.. పశువులను ఈ సమయంలో ఎక్కడికి తోలుకువెళ్తున్నావని ప్రశ్నించారు. అయితే అతను పొంతన లేని సమాధానం చెప్పటంతో గ్రామస్తులు అవి అపహరించిన గేదెలుగా గుర్తించి యద్దనపూడి పోలీసులకు సమాచారం అందించారు. పర్చూరు మండలం కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన గొట్టిపాటి మారుతికి చెందిన పశువులుగా గుర్తించి వాటిని పశుపోషకుడికి అందజేశారు. కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన నిందితుడు జూపూడి ప్రతాప్ పర్చూరు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

బంగారు గొలుసు అప్పగింత

అద్దంకి రూరల్: బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బంగారు చైన్‌ను డిపో మేనేజర్ ఆ ప్రయాణికుడికి అందజేశారు. డీఎం తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలు సమతా నగర్‌కు చెందిన ప్రయాణికుడు సుబ్రహ్మణ్యం మంగళవారం అద్దంకి డిపోకు చెందిన బస్సులో అద్దంకి నుంచి ఒంగోలు బయలుదేరాడు. బస్సులో తన బంగారు గొలుసు పోగొట్టుకున్నాడు. ఈ విషయం గమనించి అద్దంకి డిపో మేనేజర్ రామ్మోహనరావుకు తెలియజేశారు. డీఎం వెంటనే సంబంధిత బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేశారు. డ్రైవర్ బస్సును పరిశీలించగా 2 సవర్ల బంగారు చైన్ కనబడటంతో తీసుకువచ్చి డీఎంకు అందజేశారు.



ప్రయాణికుడికి బంగారు గొలుసు అందజేస్తున్న డీఎం